క్లుప్తంగా

అభయాంజనేయ స్వామికి ప్రత్యేకపూజలు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని బృందావన్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయం తృతీయ వార్షికోత్సవంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి, భరతసింహారెడ్డి, శివరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

స్టేషన్ మహబూబ్‌నగర్: అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా సోమవారం పట్టణంలో పేదలకు దుప్పట్లతోపాటు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో 28 ఏళ్ల నుంచి తమవంతు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాఖుబ్, మహెబూబ్ అలీ జవాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థానాలకు చేరాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకులు ఆకాంక్షించారు. స్థానిక మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలు, కళాశాలలను సోమవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వంటగది, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇటీవలే ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ మైనార్టీ విభాగం అసెంబ్లీ కోఆర్డినేటర్ షా ఫైసల్, చైర్మన్ ఫక్రుద్దీన్ ఖురేషి, పట్టణ అధ్యక్షుడు గులాంఅహ్మద్ జహీర్, నాయకులు షేక్ ఫక్రు, మహ్మద్‌అక్బర్, మహ్మద్‌బాసిత్, మొయిజ్, మహ్మద్‌ఫహీం, ఖుర్షీద్‌అలీ, అబ్రార్ హుస్సేన్ ఉన్నారు.

పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని 26 గ్రామాల్లో చేపట్టిన సమగ్ర సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని ఎంపీడీఓ కరుణశ్రీ ఆదేశించారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సమగ్ర సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు.

మాలల అభ్యున్నతికి కృషి చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మాలల అభ్యున్నతి కోసం ప్రతి కార్యకర్త కృషిచేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు అన్నారు. సోమవారం అంబేద్కర్ కళాభవన్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మాల మహానాడు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అమరేందర్‌ను నియమించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగ ద్దయాదయ్య, నాయకులు చెన్నయ్య, శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

తండాలకు తారురోడ్డు

గండేడ్: మారుమూల గిరిజన తండాలకు తారురోడ్డు వేయడం గర్వించదగ్గ విషయమని డీసీసీ ఉపాధ్యక్షుడు ఆశిరెడ్డి తెలిపారు. సోమవారం పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో చెల్మిల్లానుంచి జిన్నారం వరకు బీటీ రోడ్డును ప్రారంభించారు. పీఆర్ డిప్యూటీ ఈఈ సురేందర్‌రెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, బాలయ్య, జైపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, దస్తయ్య, గోపాల్, ఖాజప్ప పాల్గొన్నారు.

చిత్రకళలో 'న్యూరిషి' విద్యార్థుల ప్రతిభ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రాజేంద్రనగర్‌లో గల న్యూరిషి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 19 నుంచి పిల్లలమర్రి మ్యూజియంలో జరుగుతున్న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. సోమవారం జరిగిన 'తెలంగాణ చారిత్రక కట్టడాలు'అంశంపై చిత్రకళ పోటీల్లో 9వ తరగతికి చెందిన ఎస్.సాయికీర్తన మొదటి, కార్తికేయ ద్వితీయ, శ్రీనిధి తృతీయ బహుమతులు సాధించారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటాల ని పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, డైరెక్టర్లు అన్నారు.

స్టాండ్‌బై మోటార్లకు అనుమతులు

- నీటి సమస్య తలెత్తకుండా చూడాలి
- కలెక్టర్ విజయేందిర బోయి
- మల్లెబోయినపల్లి పంప్‌హౌజ్ సందర్శన



మల్లెబోయిన్‌పల్లి పంప్‌హౌజ్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

సాక్షి ఎఫెక్ట్..

జడ్చర్ల టౌన్: మల్లెబోయినపల్లి పంప్‌హౌజ్‌లో స్టాండ్‌బై మోటార్ల కొనుగోలుకు కలెక్టర్ విజయేందిర బోయి అనుమతులు జారీ చేశారు. సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'జడ్చర్లలో నీటిసమస్య తీవ్రం' అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు, పాలకవర్గం సభ్యులు స్పందించారు. కలెక్టర్ మల్లెబోయిన్‌పల్లి పంప్‌హౌజ్‌ను సందర్శించారు. అక్కడ మిషన్ భగీరథ అధికారులతో పాటు మున్సిపల్ కమిషనర్, వాటర్ సిబ్బందితో సమీక్ష జరిపారు. పంప్‌హౌజ్‌లో రెండు మోటార్లు ఉండగా స్టాండ్‌బై ఒకటే మోటార్ ఉందని గుర్తించిన కలెక్టర్ వెంటనే రెండో మోటార్‌ను సైతం స్టాండ్‌బైగా ఉంచుకోవాలని సూచించారు. ఒక మోటార్ పాడైతే దానిని బాగుచేయించే వరకు స్టాండ్‌బై మోటార్ వినియోగించటం బాగానే ఉందని, రెండోది కూడా పాడైతే ఎలా అంటూ 'భగీరథ' అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతం అదే జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి సమస్య రాకుండా చూడాలని అన్నారు. మున్సిపాలిటీకి అవసరమైన 12ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయించాలని కమిషనర్ లక్ష్మారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ అధికారులు నిత్యం 10ఎంఎల్‌డీ నీటిని ఇస్తున్నామని వివరించారు. తమకు నిత్యం అన్ని నీళ్లు రావటం లేదని వాటర్ సిబ్బంది కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నాగసాల పంప్‌హౌజ్ నుంచి 3.5ఎంఎల్‌డీ నీటి సరఫరా సవ్యంగా జరుగుతుందని, మల్లెబోయిన్‌పల్లి వద్ద మోటార్లు పనిచేయకపోవటంతో నీటి సరఫరా సక్రమంగా జరగటం లేదన్నారు. జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా చేయాలని ఆమె ఆదేశించారు. మల్లెబోయిన్‌పల్లి వద్ద నీటి స్టాక్‌పాయింట్ సామర్థ్యం పెంచాలని భగీరథ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనుమతులన్నీ ఇస్తామని, వెంటనే పనులు చేయాలని ఆమె ఆదేశించారు.

పాలకవర్గంలోనూ చర్చ

పదవీ బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డితోపాటు కౌన్సిలర్లు సోమవారం కార్యాలయంలో నీటిసమస్యపై చర్చ జరిపారు. వాస్తవంగా వస్తున్న నీటి సరఫరా, కావాల్సిన నీటి సరఫరాకు తేడాలను తగ్గించేలా చూడాలని నిర్ణయించారు. భవిష్యత్తులో సమస్య రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే మహబూబ్‌నగర్ నుంచి నీటిని సరఫరా చేసుకునేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం మల్లెబోయిన్‌పల్లిలో రెండు మోటార్లు పనిచేస్తుండటంతో మున్సిపాలిటీలో నీటి సమస్య కొంతమేర తీరింది. మంగళవారం ఉదయం వరకు అన్నిప్రాంతాలకు నీటి సరఫరా చేసేలా నిర్ణయించారు. కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, కుమ్మరి రాజు, చైతన్య, జ్యోతికృష్ణారెడ్డి, చైతన్య చౌహన్, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా నమోదు చేయాలి

జడ్చర్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం ఆమె జడ్చర్లలోని బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల, శ్లోక స్కూల్‌లో ఏర్పాటుచేసిన డేటా ఎంట్రీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆన్‌లైన్ నమోదు సందర్భంగా ఎదురవుతున్న ఇబ్బందులను, సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎలాంటి అనుమానాలొచ్చినా వెంటనే ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం అయ్యేలా చూసుకోవాలన్నారు. నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



అడ్డాకుల: భూత్పూర్ పట్టణంలోని సాహితీ కాన్సెప్ట్ స్కూల్‌లో సోమవారం రవి ఫౌండేషన్, రవి చిన్న పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈశిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ ప్రారంభించారు. చిన్న పిల్లల వైద్యుడు శేఖర్ పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సత్యం, డాక్టర్లు మౌనిక, దివ్య తదితరులు పాల్గొన్నారు.

'పోరాటాలకు సిద్ధం'

మహబూబ్‌నగర్ రూరల్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, పట్టణ రెసిడెన్షియల్ పాఠశాలలు, సర్వశిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేసేందుకు సిద్ధమైనట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ అన్నారు. ఈ పోరాటాల్లో భాగంగా ఈనెల 27, 28 వ తేదీల్లో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ మేరకు మండలంలోని కోడూర్ గ్రామ శివారులో గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులతో సోమవారం భోజన విరామ సమయంలో సమావేశం నిర్వహించారు. పాఠశాల స్థాయి నిరసనలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు, బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఛలో అసెంబ్లీ కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎన్.కిష్టయ్య, కేజీబీవీ ఎస్‌ఓ సువర్ణ, ఉపాధ్యాయులు ప్రమీల, నిరంజనమ్మ, జహేదా బేగం, మల్లిక, విజయలక్ష్మి, భార్గవి, వరలక్ష్మి, భవాని, శోభ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదాబేగం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ ముసాయిదాబేగం

గండేడ్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ, అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదాబేగం అన్నారు. సోమవారం మండలంలోని వెన్నాచేడ్ బాలుర, బాలకల ఉన్నత పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులతో, ఏజెన్సీ వారితో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. లేదా అన్న విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మోడల్ స్కూల్ హాస్టల్‌లో బియ్యాన్ని పరిశీలించారు. బియ్యంలో పురుగులు ఉండడాన్ని గమనించిన ఆమె ఎస్‌ఓ లక్ష్మీబాయికి ఫోన్‌చేసి బియ్యాన్ని మార్చాల్సిందిగా ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా, వంటగది షెడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ దేవన్న, ఎంఈఓ జనార్దన్ తదితరులున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్షాలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్షా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం నాయకులు సమ్మె నోటీసును కలెక్టర్ కార్యాలయంలో ఏఓ శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా విద్యాశాఖ అభివృద్ధిలో రాష్ట్ర వ్యాప్తంగా 19వేల మంది పాలుపంచుకుంటున్నారని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రత లేకుండా ఉన్నారని, వెంటనే వారికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో ప్రభుత్వం సమస్య పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనతో రైతులు దివాలా

మహమ్మదాబాద్: కేంద్రంలో మోదీ పాలనతో రైతులు దివాలా తీశారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రానికి చేరుకున్న రైతురక్షణ యాత్రలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర రైతు వ్యతిరేక విధానాలతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల్‌రెడ్డి, సంతోష్, గోపాల్, వెంకటేశ్, నరసింహా, భీమయ్య, రాములు, హనుమయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు

దేవరకద్ర: మండలంలోని అడవి అజిలాపూర్, లక్ష్మీపల్లి గ్రామాల్లో దేవాలయాల్లో సోమవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పూజలు చేశారు. అడవి అజిలాపూర్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన ఉత్సవాలు జరిగాయి. గ్రామంలో కోట మైసమ్మ విగ్రహం, తంగెళ్ల మైసమ్మ, పోతురాజు విగ్రహాలను ప్రతిష్టించారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, దేవరకద్ర మండల పార్టీ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్, కొకుంట్ల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు హన్మంతరెడ్డి, చందుగౌడ్, రాజుగౌడ్ ఉన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

- ఘనంగా కార్తీక దీపోత్సవం
- మహిళల ప్రత్యేక పూజలు



జడ్చర్లలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



మహమ్మదాబాద్: పూజలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



గంగాపురం మార్గంలోని ఆలయంలో..

జడ్చర్ల టౌన్: పట్టణంలోని పలు ఆలయాలకు కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక మాసం చివరి సోమవారం శివాలయాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం జరుపుకున్నారు. మహిళలు ప్ర త్యేక పూజలు చేశారు. బాదేపల్లి పాత బజార్ భాగ్యేశ్వర ఆలయంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు భార్గవ శర్మ, రంగనాయక ఆలయ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో భక్తులు దీపాలు వెలిగించారు. జ్ఞాన సరస్వతి సహిత అయ్యప్పస్వామి ఆలయంలో వీహెచ్‌పీ సహకారంతో అయ్యప్పసేవాసమితి ఆధ్వర్యంలో దీపాలు వెలిగించారు. అన్ని శివాలయాలు, వెంకటేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం నిర్వహిచారు.

నంచర్లలో అయ్యప్ప నామస్మరణ

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్ల గ్రామంలో అయ్యప్ప నామస్మరణతో మహాపడిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ స్వగృహంలో సోమవారం గురుస్వాములు శ్రీనివాస్, రాజుగౌడ్, అంజిరెడ్డి, పాలెంశ్రీను, బాలు, బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఈ పూజ కార్యక్రమం కొనసాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప మాలాధారణ అనేది చాలా పవిత్రమైనది. అలాంటి మాల ధరించడం స్వాములు చేసుకున్న పుణ్యఫలమని అన్నారు.

వాసవీమాతకు ప్రత్యేకపూజలు

మిడ్జిల్: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వనమహోత్సవం నిర్వహించారు. వాసవీమాతకు ప్రత్యేకపూజలు చేశారు. తులసి చెట్టుకు పూజలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఆటపాటలతో అలరించారు. జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, తహసీల్దార్ రాజు, ఆర్‌ఐ అంబిక, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సత్యంగుప్త, విజయ్, శ్రీనివాసులు, మహేష్, రమేష్, సింహ్మయ్య, నాగేష్ మహిళలు పాల్గొన్నారు.

పాఠశాలలో 'సివిల్' శిక్షణాధికారులు



దేవరకద్ర: విద్యార్థులు, అధ్యాపకులతో సివిల్ సర్వీస్ శిక్షణాధికారుల బృందం

దేవరకద్ర: మండలంలోని గుడిబండ గ్రామంలో యూపీఎస్ పాఠశాలను సివిల్ సర్వీస్ శిక్షణాధికారులు సోమవారం సందర్శించారు. పాఠశాల వసతులను, విద్యా బోధన పద్ధతులను వారు పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థులకు అందించే భోజనాన్ని తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం పనులపై అధ్యాపకులతో మాట్లాడారు. చదువులను నిర్లక్ష్యం చేయరాదని, చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుదని విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ముఖాముఖి

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి గ్రామంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ట్రైనీ అధికారులు ముఖాముఖి నిర్వహించారు. సోమవారం గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చారు. ట్రైనీ అధికారుల బృందం సభ్యులు పారుల్ సింగ్ (ఐఈఎస్), ఆదిత్యరాజ్ (ఐఆర్‌ఎస్), యశ్ సురేకుమార్ కాలె (ఐఎఫ్‌ఓ), హరిప్రశాంత్ (ఐపీఎస్), మాన్సి రాజీవ్ గోఖలె (ఐసీఎల్‌ఎస్)లు జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అమలవుతున్న పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. వారితోపాటు ఎంఈఓ మంజులాదేవి, పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

తీగలపల్లిలో స్వచ్ఛభారత్

నవాబుపేట: మండలంలోని తీగలపల్లి గ్రామంలో ఉన్న సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు సోమవారం గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి వీధులు శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో ప్రజలకు పరిశుభ్రత, మన భద్రత అనే అంశంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో అధికారులు, పంచాయతీతో పాటు గ్రామస్తుల కర్తవ్యం అని వారు వివరించారు. గ్రామస్తులు, మండల అధికారులు పాల్గొన్నారు.

న్యాయం కోసం ఎస్పీకి మహిళ వినతి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తన భర్త ఏడాది క్రితం మరో మహిళను రెండో పెళ్లి చేసుకుని తనను ఇంటి నుంచి వెళ్లగొట్టాడంటూ హన్వాడ మండలం తిర్మలగిరికి చెందిన ఎరుకలి మంగమ్మ సోమవారం ఎస్పీ జానకికి ఫిర్యాదు చేశారు. మూసాపేట మండలంలోని తుంకిల్‌పూర్ వాసి శేఖర్‌తో తనకు 2015లో ప్రేమ వివాహమైందని, ఇద్దరూ ఆడపిల్లలే జన్మించారన్నారు. మగ సంతానం లేకపోవడంతో అత్తింటివారు వేధించి బయటకు గెంటేశారని ఆరోపించారు. ఈ విషయమై 2020లో మహబూబ్‌నగర్‌లోని మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైందన్నారు. అయినా మార్పు రాకపోవడంతో గత సెప్టెంబర్ 9న ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశానన్నారు. ఇప్పటివరకు అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అందులో పేర్కొన్నారు. తనకు న్యాయంచేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజావాణికి 6 వినతులు

నవాబుపేట: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన ప్రజావాణికి సోమవారం 6 వినతులు వచ్చినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. ఈ దరఖాస్తులు రెవెన్యూ, ఐకేపీకి సంబంధించినవి, వాటి పరిష్కారం కోసం చర్యలు చేపట్టామన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

మిడ్జిల్: మండల కేంద్రంలో వ్యవసాయ పొలాలకు వెళ్తున్న రోడ్డును ఐదేళ్ల నుంచి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో మిడ్జిల్‌కు చెందిన కుచూరు శ్రీనువాస్‌రెడ్డి, ఎల్గొండ శ్రీనువాస్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. బైరంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శివప్రసాద్ ఎన్‌ఆర్‌ఈజీఎస్ చేసిన పనులకు డబ్బులు అకౌంట్‌లో జమఅయిన తక్కువగా ఇచ్చారని ఆడబ్బులు ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చారు.

ధర్నా జయప్రదం చేయాలి

గండేడ్: కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుండుమల్ల నర్సింలు పేర్కొన్నారు. సోమవారం గండేడ్‌లో ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కేశవులు, రాజు, తిరుపతయ్య, శ్రీను, మల్కయ్య పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మహమ్మదాబాద్: మెనూ ప్రకారం భోజనం అందించాలని అధికారులు ఆదేశించారు. సోమవారం మండలంలోని నంచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాని తహసీల్దార్ తిరుపతయ్య, ఎంఈఓ రాజునాయక్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. సమస్యలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలలు పరిశుభ్రంగా ఉంచుతున్నారా? రూములు పరిశుభ్రంగా ఉన్నాయా అన్నకోణంలో పరిశీలించారు.

రెండు ట్రాక్టర్లు పట్టివేత

మహమ్మదాబాద్: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. గండేడ్ మండలంలోని సల్కర్‌పేట్ గ్రామానికి చెందిన పెంటయ్య, బైస్‌పల్లికి చెందిన దేవ య్య ఆదివారం రాత్రి వేళ రంగారెడ్డిపల్లి వాగునుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అక్కడికి వెళ్లిన పోలీసులు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

కళాకారుల ప్రదర్శన

మహబూబ్‌నగర్ న్యూటౌన్: స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేస్తేనే రైతులకు న్యాయం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. రైతు రక్షణయాత్ర కార్యక్రమంలో బాగంగా జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో కళాకారుల ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భీమయ్య, సంతోశ్, విల్సన్, గోపాల్, వెంకటేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆదర్శనీయం

స్టేషన్ మహబూబ్‌నగర్: యేసు క్రీస్తు బోధనలు ప్రపంచానికి ఆదర్శనీయమని విశాఖపట్నంకు చెందిన ఎఫ్‌డీఎం వరల్డ్ ఇండియావ్యాఖ్యోపదేశకులు పాస్టర్ ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్‌హాల్‌లో సోమవారం రక్షణ దుర్గం, జీసస్ పవర్ అపోస్తలిక్ మినిస్ట్రీస్ దాసరి శామ్యుల్ అధ్యక్షతన దైవసేవకుల ఉమ్మడి జిల్లా వేదిక సమావేశం నిర్వహించారు. పీఏ.దేవదాస్ ప్రారంభ ప్రార్థన చేశారు. అనంతరం పాస్టర్ ప్రసాద్ ముఖ్య సందేశమిచ్చారు. చర్చిలు కట్టడం కాదు కుటుంబాలు కట్టుబడాలని, సంఘ నిర్మాణం జరగాలన్నారు. ఇతరుల పట్ల ప్రేమ భావంతో ఉండాలని కోరారు. అనంతరం పలువురు భక్తిగీతాలు ఆలపించారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పాస్టర్లు హాజరయ్యారు. ఆర్.జాన్, ప్రసాద్, దాసరి శామ్యుల్, దేవదాస్, జ్యోతిబాబు, దాసరి సుందర్, డీఆర్‌వీ ప్రసాద్, కేటీ.బెంజెమెన్, ఆశీర్వాదం, కృపాదానం, శ్రీకాంత్, ప్రిస్కిళ్ల, ఆర్.ప్రసాద్, సజీవమ్మ, ప్రేమ్‌రాజ్, సంసోన్ పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

- టీయూసీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి వెంకటేష్



కోయిల్‌కొండ: కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా కార్మికులు, రైతులు, కూలీలు పోరాటాలకు సిద్ధం కావాలని టీయూసీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి వెంకటేష్ అన్నారు. సోమవారం మండలంలోని అభంగపట్నం గ్రామంలో కార్మికులతో కలసి మాట్లాడారు. నవంబర్26 జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను కేంద్రప్రభుత్వం మారుస్తూ తుంగలో తొక్కిందని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షులు సత్తన్న, నాగరాజు, ఆంజనేయులు, కృష్ణయ్య, రాకమయ్య, మొగులయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందనలు



మహమ్మదాబాద్: మండలంలోని కస్తూర్బా పాఠశాలకు చెందిన విద్యార్థినులు నేషనల్ కరాటేలో పాల్గొని మొదటి బహుమతి సాధించారు. సోమవారం వారిని నాయకులు, విద్యావంతులు పాఠశాలలో అభినందించారు. ఈసందర్భంగా రిటైర్డ్ జీహెచ్‌ఎం రాములు మాట్లాడుతూ మారుమూల గురుకుల పాఠశాల నుంచి ఎలాంటి కోచింగ్ లేకుండా నేషనల్ కరాటే పోటీల్లో విజయం సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. పాఠశాల విద్యార్థులకు మాజీ ఎంపీపీ శాంతిబాయి, రహీం, అక్బర్, ముంతాజ్, సుమన్ అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

దేవరకద్ర: కేంద్రం అవలంబిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ముందు మంగళవారం చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐకేఎస్, టీయూసీఐ జిల్లా కార్యదర్శులు సీహెచ్ రాంచందర్, సాంబశివుడు కోరారు. సోమవారం కొకుంట్లలోని వెంకటేశ్వర్ వేర్ హౌస్ వద్ద ప్రచారం నిర్వహించి మహిళా కార్మికులతో మాట్లాడారు.